క్లుప్తంగా

అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ పార్క్ హోటల్‌లో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ అవగాహన సదస్సును శనివారం నిర్వహించినట్లు డైరెక్టర్ బొంగరాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ దేశాలకు వెళ్లాలనుకునే వారికి పలు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాల్వ తవ్వకం పనుల పరిశీలన

కూసుమంచి: కూసుమంచిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సారెస్పీ కాల్వ తవ్వకం పనులను చేపట్టారు. ఆదివారం ఈమేరకు జలవనరులశాఖ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈఈ రత్నకుమారితో కలిసి పరిశీలించారు. కాల్వ తవ్వకం పూర్తి కావడంతో పలు గ్రామాల రైతులకు శ్రీరాంసాగర్‌తో పాటు భక్తరామదాసు నీటిని కూడా అందించబడుతుందన్నారు. అనంతరం పాలేరు పాత కాల్వను పరిశీలించిన ఆయన కాల్వలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



నగదు, బియ్యాన్ని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కామేపల్లి: ముచ్చర్ల–జాస్తిపల్లి హైస్కూల్‌లో 10వ తరగతి చదివిన(2003–04 బ్యాచ్) పూర్వ విద్యార్థి షేక్ షబ్బీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. షబ్బీర్ కుటుంబం నిరుపేదలు కావడంతో విషయం తెలుసుకున్న అతడి తోటి మిత్రులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.40 వేల నగదు, క్వింటాన్నర బియ్యాన్ని అందించారు.

నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: రజకుల ఆరాధ్య దైవం మడేలయ్య ఉత్సవాల సందర్భంగా ఆదివారం రజకులు ఘనంగా నివాళులర్పించారు. త్రీటౌన్ మహిళా కళాశాల వెనుక చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నుంచి ప్రదర్శనగా బయలుదేరి మున్నేరు కాల్వొడ్డున స్వామివారికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకుడు పిల్లుట్ల కృష్ణ, శ్రీనివాస్, మహేశ్, వెంకటేశ్వర్లు, మురళి, శ్రీకాంత్, వంశీ, వెంకన్న, శివసాయి, పి.శ్రీనివాస్, సత్యం, తిరుపతిరావు, నాగరాజు, గంధంకోట, చంద్రయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



ఏన్కూర్ టీంకు నగదు, షీల్డ్ అందిస్తున్న ఆరెం రవి,నాయకులు

కామేపల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆరెం రవి అన్నారు. మండల పరిధిలోని కెప్టెన్‌బంజర గ్రామంలో గ్రామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పలు మండలాలస్థాయి క్రికెట్ టోర్నీ ఆదివారం ముగియగా.. గెలిచిన టీమ్‌లకు బహుమతులు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చివరి రోజు ఫైనల్ మ్యాచ్ కెప్టెన్‌బంజర, ఏన్కూర్ టీం మధ్య జరుగగా.. ఏన్కూర్ టీం విజయం సాధించి రూ.20 వేలు సాధించగా.. రెండో బహుమతి రూ.10 వేలు కెప్టెన్‌బంజర టీంకు నగదుతో పాటు షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో దాత దేవండ్ల రామకృష్ణ, మాజీ సర్పంచ్ గుంపెనపల్లి అనంతరాములు,టోర్నీ నిర్వాహకులు వెంకట్, రాంబాబు, ఫణికుమార్, లక్ష్మణ్, వెంకీ, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	ప్రేమలు
సాయిరాం	యమధీర
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	హనుమాన్

– ఖమ్మంగాంధీచౌక్

ఆర్థిక ఆలంబనకు..

కూలీలకు ఉపాధి..
పల్లెల అభివృద్ధి..

- ఈ ఏడాది రూ.29 కోట్ల పనులకు ప్రణాళికలు
- భూగర్భ జలాల పెంపుదలకు ప్రాధాన్యత
- కూలీలకు చేతినిండా పనులు
- కానీ వేతనాల చెల్లింపులో జాప్యం
- ఈసారైనా సకాలంలో వేతనాలు అందించాలని వేడుకోలు



నేలకొండపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఆలంబనను ఇస్తోంది. ఈ పథకంతో ఓ వైపు కూలీలకు చేతినిండా పని లభిస్తుండగా.. మరో వైపు పల్లెలు అభివృద్ధి బాటలో పురోగతి సాధిస్తున్నాయి.

నేలకొండపల్లి: మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.29 కోట్లు విలువైన పనులకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో రూ.18.56 లక్షలను ఉపాధి కూలీలకు వేతనాలుగా చెల్లిస్తుండగా.. మిగిలిన నగదును మెటీరియల్‌కు కేటాయించనున్నారు. మండలంలోని 11,705 మంది ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు ఉండగా.. ఇప్పటి వరకు 127 కుటుంబాలు వంద రోజులు పని దినాలు చేశారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే అన్ని పనులకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతి పొందగా.. కూలీలు ఆర్థికంగా స్వాంతన పొందనున్నారు.

నీటి నిల్వ పనులకు ప్రాధాన్యం..

వచ్చే ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో నీటిని నిల్వ చేసి, భూగర్భ జలాలవృద్ధికి తోడ్పడే పనులకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా నీటి కుంటలు, కందకాలు, పంట కాల్వ పనులను అధిక సంఖ్యలో ఎంపిక చేశారు. అలాగే చెరువులలో ఫీడర్ ఛానళ్లు, ఫీల్డ్ ఛానళ్ల, పంట కాల్వలు, పూడికతీత పనులను చేపట్టనున్నారు. రైతులు ఆయా సామాజిక సంఘాలకు సంబంధించిన బీడు భూముల అభివృద్ధి పనులను ప్రాణాళికలలో చేర్చారు. వీటితో పాటు వ్యవసాయ పొలాలకు మట్టి రోడ్ల నిర్మాణం, ఇళ్ల పరిసరాలలో ఇంకుడు గుంతలు, గొర్రెల పాకల నిర్మాణం, ప్లాంటేషన్(మొక్కల పెంపకం) నర్సరీల పెంపకం, పనులకు ప్రధానంగా గుర్తించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులు, కూలీలకు జీవనోపాధి కల్పించాలన్న లక్ష్యంతో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ముందుకు సాగుతున్నారు.

వెంటాడుతున్న వేతనాల సమస్య..

మండలంలో ప్రతీ ఏటా ఉపాధి హామీ పనులు సరిపడా పనులు అందిస్తారు. అంత వరకు బాగానే ఉన్నా.. చేసిన పనులకు మాత్రం వేతనాలు చెల్లించడం లేదని కూలీలు మండిపడుతున్నారు. గతేడాది చేసిన పనులకు కూడా ఇంకా బిల్లులు రావాల్సి ఉందంటే వేతనాలు సమస్య ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు మాత్రం 15రోజులకోకసారి కూలీల ఖాతాలలో డబ్బులు జమఅవుతాయని చెబుతున్నారు కానీ ఆచరణలో అమలుకావడం లేదని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా కచ్చితంగా బిల్లులు సక్రమంగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



కూలీలు ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించాం. ఉపాధి కూలీలకు ఈజీఎస్ అండగా నిలుస్తోంది. మండలంలోని ఉపాధి కూలీలకు సరిపడా పనులు గుర్తించాం. రైతులతో పాటు ఉపాధి కూలీలకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో పనులను ఎంపిక చేశాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

వేతనాలు సక్రమంగా ఇవ్వాలి..



కూలీలకు వేతనాలు సక్రమంగా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉపాధి కూలీలకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. వారం వారం డబ్బులు అందించేలా చూడాలి. గతేడాది పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలను అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాశిబోయిన అయోధ్య, వ్య.కా.సం. నాయకుడు

సౌకర్యాలు కల్పించాలి..



ఉపాధి కూలీలు పని చేసే చోట తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయడం వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఉన్నత విద్య చదువుకున్నప్పటికీ పనులకు వెళ్తున్నాం. ఉపాధి చట్టం మేరకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎండ తీవ్రత దృష్ట్యా అలవెన్సులను గతంలో కంటే మరింత పెంచాలి.

– చట్టు సతీశ్, కూలీ, సుర్దేపల్లి

షాదీఖానాను రక్షించండి



మాట్లాడుతున్న సలాం

ఖమ్మంమయూరిసెంటర్: నిర్వాహణ సక్రమంగా లేక ఉర్దూఘర్ షాదీఖానా ఓ భూత్ బంగ్లాగా మారిందని, కూలిపోయే స్థితికి భవనం చేరుతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం అన్నారు. ఆదివారం షాదీఖానాను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పైపై మెరుగులు దిద్దుతూ షాదీఖానా శిథిలావస్థకు చేరుతున్నా.. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం లేదన్నారు. షాదీఖానాకు వస్తున్న ఆదాయం, ఖర్చుల వివరాలు చెప్పేవారు లేకుండా పోయారని, అధికారులను ప్రశ్నిస్తే పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. నూతన షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించి, నిధులు మంజూలు చేసి హడావిడి చేశారని, కానీ ఇప్పటివరకు నిర్మాణానికి అడుగులు పడడం లేదని,చెరువుకు సంబంధించిన భూమిలో భవనం కట్టడం వలన భవిష్యత్‌లో ముంపు పొంచి ఉందన్నారు. పాత షాదీఖానాకు మరమ్మతులు చేయాలని, కొత్త భవన నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ రెహమాన్, నిజాంపేట్ యాకుబ్, ఖిల్లా ముజామ్మిల్, రెహమాన్, అహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం..

ఖమ్మంగాంధీచౌక్: సినీ నటుడు రాంచరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఆదివారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేశారు. తొలుత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు గుండాల వీరేష్‌గౌడ్ ఆధ్వర్యాన సేవా మూర్తి మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీ సాధిక్ అలీ, మేకల సైదులు, కొమ్ము విజేత, రక్తదాతలు అరుణ్‌కుమార్, హుస్సేన్, ఉదయ్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: నగరానికి చెందిన బొమ్మ నాగేశ్వరావు తనయుడు బొమ్మ ప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఖమ్మం అన్నం ఫౌండేషన్‌లో ఆదివారం రాత్రి బొమ్మ నాగేశ్వరరావు దంపతులు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అన్నం శ్రీనివాసరావు, బొమ్మ దుర్గ, గజేంద్రుల వేణు, రేఖ, మార్త సుధీర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి..



తిరుమలాయపాలెం: కాకరవాయిలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు



ఖమ్మంరూరల్: ఏదులాపురంలో..

తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యాన, ఖమ్మంరూరల్ మండలంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యాన గ్రామాల్లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అంతేకాక ఏదులాపురం గ్రామ శివారు తాళ్లేసేతండాలో సానియో ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశంలో మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాస్‌లైన్‌పార్టీ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు, మధు, ఉపేందర్, బోస్, ఏఐవైఎఫ్ నాయకులు ఉపేందర్, టి.శ్రీను, ఎం.సాయి, వెంపటి రాము, ఎ.చిన్న, బాలకృష్ణారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, షేక్.బషీరుద్దీన్, జి. వీరబాబు, పుల్లయ్య, ఎం.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



హోలీ వేడుకలో పాల్గొన్న ప్రసాద్‌రెడ్డి

కూసుమంచి: వచ్చే హోలీ నాటికి అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన తన సతీమణి శ్రీలక్ష్మితో కలిసి హోలీ వేడుకలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా హోలీ శుభాకాంక్షలు తెలియజేసి కానుకలు అందించి బంజారా మహిళలతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, చావా శివరామకృష్ణ, సేట్రాం నాయక్, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, నెల్లూరి భద్రయ్య, మంకెన వాసు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కూసుమంచిలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ప్రసాద్‌రెడ్డితో పాటు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా 'మట్టల ఆదివారం'

ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ మందిరాలు, చర్చిల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవ మతపెద్దలు ఏసుక్రీస్తు పునరుత్థానం గురించి ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఉపదేశాలు చేశారు. ఈత మట్టలకు పూలను అలంకరించి ప్రదర్శనగా గీతాలు ఆలపిస్తూ పురవీధుల్లో తిరుగుతూ మందిరాలకు చేరుకున్నారు.

– కామేపల్లి/ గాంధీచౌక్



కామేపల్లి: వేడుకలో పాల్గొన్న ఫాదర్ వినయ్, చిన్నారులు



ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో.. వాఖ్యోపదేశం చేస్తున్న ఫాదర్లు

నేటి నుంచి అంకమ్మతల్లి జాతర..

- 30న పునఃప్రతిష్ఠామహోత్సవం
- ముస్తాబైన కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని దేవాలయం



ముస్తాబైన అంకమ్మ దేవాలయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ దేవాలయ జాతర వేడుకలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రతీ ఏడాది తరహాలోనే ఈ ఏడాది ఐదు జాతర వేడుకలను నిర్వహించడానికి దేవాలయ కమిటీ వారు భారీ ఏర్పాట్లు చేశారు. జాతరతో పాటు దేవాలయ పునర్‌నిర్మాణం పూర్తి చేసుకొని ఈ నెల 30న పునఃప్రతిష్ఠ మహోత్సవం, నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ వేడుకలను నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొమ్ము భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు, కోశాధికారి గుండోజు రామాచారి, తదితర పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యాన జాతర, ప్రతిష్ఠ వేడుకలకు సిద్ధం చేశారు. సోమవారం నుంచి వరసగా ఐదు రోజుల పాటు జాతర వేడుకలను నిర్వహించనుండగా.. ఈనెల 28, 29 తేదీల్లో ప్రతిష్ఠలో భాగంగా పూజా కార్యాక్రమాలను నిర్వహించనున్నారు. 30న యంత్రస్థాపన, విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ వేడుకలను నిర్వహించనున్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

కూసుమంచి: మండలంలోని ధర్మాతండా, మల్లాయిగూడెం గ్రామాల్లోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి ఆలయాల్లో స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈనేపథ్యాన పలువురు దంపతులు పీటలపై కూర్చొనగా అర్చకులు స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన అన్నదానం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు.

సాయి మందిరంలో కల్యాణ వేడుకలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లో గల సాయిబాబా మందిరంలో ఆదివారం రాత్రి రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణులవారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో అర్చకులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గుంటు మల్లన్న ఆలయంలో 16 రోజుల పండుగ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ ట్రంక్ రోడ్‌లో గల శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి వారి 16 రోజుల పండుగను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి చందూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, కృష్ణశర్మలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

టేకులపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఫాల్గుణ పూర్ణిమ సందర్భంగా నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లి డబుల్‌బెడ్రూం సముదాయంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ సభ్యుల ఆధ్వర్యాన గ్రంథాల ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరాలు తెలుసుకుంటే దైవ రంగు, జ్ఞానవర్ణంను అందరూ పూసుకున్నట్లే అగునని, హోలీ జరుపుకున్నట్లే అవుతుందని కమిటీ బాధ్యులు తెలిపారు. ప్రతి పౌర్ణమి పూర్ణ జ్ఞానానికి గుర్తుగా ఉంది కాబట్టి పెద్దలు ఫాల్గుణ పూర్ణిమ రోజే ఇలా రంగు చల్లుకోవడం ఒక జ్ఞాన సూచనగా ఉంచారని అర్థం చేసుకోవాలి ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగరాజు, విజయమ్మ, సుజాత, లక్ష్మణ్, జయశ్రీ, సంజయ్, ఐశ్వర్య, అశ్విని, నాగరాజు, సుజాత, వినురాధ, ఉమ, మమత, మల్సూరు, హారతి తదితరులు పాల్గొన్నారు.

హోలీ హోలీల రంగ హోలీ..

నేడు రంగుల పండుగ



ఖమ్మంగాంధీచౌక్: హోలీ వేడుకలను నేడు(సోమవారం) రంగులతో ఆడిపాడేందుకు చిన్న, పెద్ద అంతా రంగం సిద్ధం చేసుకున్నారు. పాల్గుణ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ హోలీ వేడుకలను కామదహనంతో మొదలు పెట్టి ఆదివారం అర్ధరాత్రి నుంచి వేడుకలను ప్రారంభించారు. కాగా, సోమవారం కులమతాలకు అతీతంగా తమ తమ సంప్రదాయాలతో ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ వేడుకను జరుపుకోనున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

సరదాగా జరుపుకునే ఈ పండుగలో వినియోగించే రంగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రసాయనాలతో కూడిన రంగులను వినియోగించం ద్వారా అందులో ఉండే సీసం, పాదరసం వంటి ప్రమాదరకరసాయనాలు ఉండడంతో చర్మ సమస్యలు, కళ్లు, అలెర్జీ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు, నిపుణులు చెబుతున్నారు. సహజ రంగులు వాడాలని, పిల్లల చెవులు, ముక్కు, కళ్లు, నోటిలోకి రంగులు పోకుండా తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు.

గ్రామాల్లో హోలీ వేడుకలు..



కామేపల్లి: బర్లగూడెంలో..



కామేపల్లి: కెప్టెన్‌బంజరలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న చిన్నారులు

కామేపల్లిలో..

కామేపల్లి: గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు.గిరిజనులు వివిధ రకాల రంగులు చల్లుకుని నృత్యాలు చేస్తూ ఆటపాటలతో సందడి చేశారు. బర్లగూడెంలో టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరునాయక్ ఆధ్వర్యాన హోలీ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాపాలాల్, రాష్ట్ర, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌నాయక్, బిచ్చనాయక్, మురళి, వీరన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్యాతండాలో..



లోక్యాతండాలో గ్రామస్తుల సంబరాలు

మండలంలోని లోక్యాతండాలో మూడు రోజుల పాటు జరగనున్న హోలీ వేడుకలు ఆదివారం కోలాటంతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేడుకల్లో భాగంగా తండావాసులు గ్రామ కూడలిలో కోలాటమాడడంత పాటు చప్పట్లతో హోలీ పాటలు పాడారు. ఈ వేడకలలో తండావాసులు, వారి బంధుమిత్రులు పెద్దసంఖ్యలో హాజరుకావడంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొని తండావాసులతో కలిసి కోలాటమాడి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తండా పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.